క్లుప్తంగా

గడప గడపకు మన ప్రభుత్వం నేడు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో శనివారం ఉదయం 6.30 గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాలు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు పాల్గొనాలని పిలుపునిచ్చాయి.

ఆదర్శంగా తీసుకోవాలి



రాపూరు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ధనమ్మ

రాపూరు: వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని రాపూరు గ్రంథాలయాధికారి ధనమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక లైబ్రరీలో శుక్రవారం కందుకూరు వీరశలింగం పంతులు, నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడ, తదితర కవుల జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఉపాధ్యాయురాలు ఆసీఫ్, గ్రంథాలయ సహాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దారుల మూసివేతపై నిరసన



నిరసన తెలియజేస్తున్న ప్రజలు

చిల్లకూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల దారులను కొంతమంది మూసి వేశారని, సర్వే చేసి దారి వసతి కల్పించాలని నాంచారమ్మ పేట, పెంటపాడు వాసులు శుక్రవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ అంశంపై ఇప్పటికే పలుసార్లు స్పందనలో అర్జీలు ఇచ్చామన్నారు. అయితే అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిర్లక్ష్యధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మూడు కాలనీల్లో సుమారుగా 300 కుటుంబాలు ఉన్నాయన్నారు. దారులు మూసి వేయడంతో తాము ఇక్కట్లు పడుతున్నామని చెప్పారు. అధికారులు సర్వే చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



సమావేశంలో మాట్లాడుతూ వక్తలు

వెంకటగిరిరూరల్: విద్యార్థులు పుస్తక పఠనం విజ్ఞానం పెరుగుదలకు దోహదపడుతుందని ఎంఈఓ వెంకటేశ్వర్లు, బాబునాయుడు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కవిసమ్మేళనం నిర్వహించారు. ముందుగా నన్నయ్య కవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు భక్త కవి, గుర్రాల రమేష్, చెంచుకృష్ణయ్య, సూర్యప్రకాష్, గ్రంథాలయాధికారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై చర్చ

గూడూరు రూరల్: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఈనెల 21న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన విజయవంతంపై సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు శుక్రవారం సాయంత్రం సమావేశమై చర్చించారు.

దుర్గామల్లేశ్వరికి ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో ఉన్న దుర్గామల్లేశ్వరీదేవి ఆలయంలో కార్తీక శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయం వద్ద అమ్మవారికి అభిషేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు.

భూసారం మెరుగు.. ఆదాయం బాగు

ప్రస్తుతం సాగుకు ఏటా పెట్టుబడి పెరిగిపోతోంది. ఫలితంగా పంట సాగుకు రైతులు వెనుకంజ వేయాల్సిన స్థితి నెలకొంటోంది. ఈ సమస్యను పరిష్కరించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం భూసార పరిరక్షణకు చర్యలు చేపడుతోంది. అపరాల సాగుకు ప్రోత్సహిస్తోంది. ఫలితంగా పచ్చిరొట్ట ఎరువు లభ్యతతో కర్షకులకు ఖర్చు తగ్గి.. దిగుబడి పెరుగుతోంది.

- రాయితీపై అపరాల విత్తనాలు పంపిణీ
- పంట మార్పిడి కింద సాగు చేస్తున్న రైతులు



బల్లవోలులో సాగు చేసిన జనుము పంట

చిల్లకూరు : అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అందులో భాగంగా వ్యవసాయ భూములను మరింత సారవంతం చేసేందుకు సహకారం అందిస్తోంది. పంట మార్పిడి కింద రైతులు సాగు చేసుకునేందుకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు అందిపుచ్చుకుంటున్నారు. జీలుగ, జనుము, పిల్లి పెసర తదితర పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని భూములను సారవంతంగా మార్చుకుంటున్నారు.

జీలుగ : ఈ విత్తనాలను ఎక్కువగా చౌడు భూముల్లో సాగు చేస్తారు. వరి కోత అనంతరం ఒక ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలను ఇసుకతో కలిపి చల్లుకుని దున్నుకుంటే సుమారు 10 టన్నుల పచ్చిరొట్టె ఎరువు అందుబాటులోకి వస్తుంది.

పిల్లి పెసర: దీన్ని ఇసుక, ఒండ్రు, బంక మిట్ట నేలల్లో సాగు చేయవచ్చు. ఎకరానికి 8 కిలోల విత్తనాలు చల్లుకోవాలి, ఇది సుమారు 4 టన్నుల పచ్చిరొట్టఎరువును అందిస్తుంది. అలాగే పశువులకు మేత కూడా పనికి వస్తుంది.

జనుము : దీన్ని అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. పచ్చిరొట్ట ఎరువుగాను, పశువులకు మేతగాను ఉపయోగించుకోవచ్చు. ఇందుకోసం ఎకరానికి 12 కిలోల విత్తనాలు చల్లుకోవాలి.

మండలం	జీలుగలు (క్వింటాళ్లలో..)	పిల్లిపెసర (క్వింటాళ్లలో..)	జనుము (క్వింటాళ్లలో..)
గూడూరు	310	156	60
చిల్లకూరు	143	68	5
కోట	400	-	30
వాకాడు	395	-	110
చిట్టమూరు	250	-	825

ఉపయోగాలివీ..

భౌతిక స్థితిని మెరుగుపరిచి నేలను గుల్లగా చేస్తుంది. అలాగే నేలలోకి నీరు ఇంకేలా చేస్తుంది. నేలలో సూక్ష్మజీవులను వృద్ధి చెంది, నేల సారవంతం అవుతుంది. దీంతో పంట దిగుబడి బాగా పెరుగుతుంది. రైతులు వాడే రసాయన ఎరువులైన డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల్లోని పోషకాలను వరి మొక్కలకు నేరుగా అందించేలా చేస్తాయి. ఇప్పటివరకు గూడూరు నియోజకవర్గంలో ప్రభుత్వం పంపిణీ చేసిన పచ్చి రొట్టె విత్తనాల వివరాలిలావున్నాయి.

భూసారం పెరుగుతుంది



వరి సాగు చేసే ముందు ఒక వైపు నారు పోసుకుని, మరో వైపు పచ్చిరొట్ట విత్తనాలను పొలాల్లో చల్లుకుంటాం. వరినాట్లుకు ముందు ఆ అపరాలను భూమిలో కలియదున్నడంతో భూసారం పెరిగి, అధిక పంట దిగుబడి వస్తుంది. ఏటా పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుంటాం.

- కందల కొండయ్య, రైతు, ఏరూరు, చిల్లకూరు మండలం

రాయితీపై పంపిణీ సంతోషం



పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందించడం సంతోషంగా ఉంది. ఏటా వరి సాగు ముందుగా పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లి పెసర తదితర అపరాలు ఏది అందుబాటులో ఉంటే దాన్ని సాగు చేస్తుంటాం. దీంతో భూమిలో పోషకాలు బాగా పెరుగుతాయి.

- తానా శ్రీనివాసులు, రైతు, వాకాడు

దిగుబడికి దోహదం



పచ్చిరొట్ట విత్తనాల సాగు చేయడంతో భూ సారం పెరగడంతోపాటు చౌడు భూములు బాగవుతాయి. అలాగే భూమి గుల్ల బారి పంట దిగుబడి పెరుగుతుంది. ప్రభుత్వం ఆయా సీజన్లలో రైతుల కోరిక మేరకు పచ్చిరొట్ట విత్తనాలను ఆర్బీకేల ద్వారా రాయితీపై అందిస్తుంది.ఈ ఖరీఫ్‌లో కూడా అందించాం.

- గోపీనాయక్, ఏడీఏ, గూడూరు

సైనికుల్లా పనిచేద్దాం



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి): ఎన్నికలు సమీపిస్తున్నాయ్.. పోలింగ్ ఏజెంట్లు సైనికుల్లా పనిచేసి.. మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్‌జేఆర్ భవనంలో శుక్రవారం బూత్‌లెవల్ ఏజెంట్లుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్నికలు జరగవచ్చన్నారు. ఎన్నికల్లో బూత్‌లెవల్ ఏజెంట్లు ఎంతో కీలకమన్నా రు. మీరంత కష్టపడి కొత్త ఓటర్లును చేర్పించి, వైఎస్సార్‌సీపీ విజయానికి తోడ్పడాలని కోరారు. వలస వెళ్లిన వారు, ఓటు లేని వారిని గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్గ విభేదాలకు తావివ్వకుండా నిజాయితీగా సమష్ట కృషితో పనిచేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, రూరల్ కన్వీనర్ కే శ్రీనివాసులురెడ్డి, బాలాయపల్లి మండల కన్వీనర్ వీ కార్తీక్‌రెడ్డి, జిల్లా సంయుక్త సహాయకార్యదర్శి సీ హరికృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి 30 నిమిషాలకు తిరుపతికి బస్సు సౌకర్యం



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎన్ఎంయూ నేతలు

వెంకటగిరిరూరల్: వెంకటగిరి–తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఇకపై ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల తిరుపతి మార్గంలో ప్రయాణించే బస్సులు తగ్గించడంతో తిరుపతికి వెళ్లే ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ఈ విషయాన్ని గమనించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పందించి, ప్రయాణికులు సౌకర్యార్థం ఆర్టీసీ ఆర్ఎం చెంగల్‌రెడ్డితో చర్చించి తిరుపతికి బస్సు సర్వీసులు పెంచి, ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని సూచించారు. నెల్లూరు మార్గం వైపు బస్సులు పెంచాలని, చెన్నైకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన ఆర్ఎం వెంకటగిరి నుంచి తిరుపతి వైపు వెళ్లే బస్సులు ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు ఉండేలా చర్యలు తీసుకుని అమల్లోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ గౌరవాధ్యక్షుడు ఎల్ కోటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, డిపో కార్యదర్శి కేవీ రత్నం ఆధ్వర్యంలో నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు వ్యక్తపరిచారు.

ప్రజలతో ఎమ్మెల్యే వెలగపల్లి మమేకం



రాఘవాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట: మండలంలోని కేసవరంలో గురువారం రాత్రి పల్లెనిద్ర అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు శుక్రవారం ఉదయం ప్రజలతో మమేకమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కేసవరంలో పల్లెనిద్ర అనంతరం శుక్రవారం ఉదయం రాఘవాపురం, సిద్ధమ్మకండ్రిగ, నక్కలకండ్రిగ గ్రామాల్లో పర్యటించారు. వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. సిద్ధమ్మకండ్రిగలో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నీటిపారుదల కాలువలను చూశారు. పంటల వివరాలు తెలుసుకున్నారు. సిద్ధమ్మకండ్రిగ వద్ద కల్వర్టు దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెప్పడంతో వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం రాఘవాపురం, నక్కలకండ్రిగలో స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తాము పలు ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నా ఇంతవరకు రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయలేదని నక్కలకండ్రిగలో వాసులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో వెంటనే రెవెన్యూ అధికారులను పిలిపించిన ఎమ్మెల్యే అర్హులైన వారందరికీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాంగురుస్వామి, ప్రసాద్, ఎస్ డీసీసీబీ డైరెక్టర్ రమణయ్య, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.



సిద్ధమ్మకండ్రిగలో పంటపొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తా

చిల్లకూరు: మండలంలోని చినకటువపల్లె నుంచి కోట మండలం మద్దాలి గ్రామం వరకు తిక్కవరం మీదుగా రాఘవాపురం మధ్య ఉన్న కల్వర్టును నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తామని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. కోట మండలం కేశవరంలో పల్లె నిద్ర అనంతరం శుక్రవారం చినకటువపల్లెకు రాఘవాపురం నుంచి వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డును పరిశీలించారు. రెండు మండలాలకు చెందిన గ్రామాలకు మెటల్ రోడ్డు వేసినప్పటికి అటవీ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు రోడ్డు మధ్యలో నిలిపోతుండడంతో రాకపోకలు సాగించలేక పోతున్నామని స్థానికులు ఆయనకు విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మార్గంలో కల్వర్టు నిర్మించేందుకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

సోలార్ వీధి దీపాల ఏర్పాటుకు ఆమోదం

చిల్లకూరు: మండలంలోని తమ్మినపట్నం, వరగలి, మోమిడి, మన్నేగుంట, లింగవరం గ్రామాల్లో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసేందుకు తమ్మినపట్నంలోని జిందాల్ (సింహపురి) విద్యుత్ ప్రాజెక్టు యాజమాన్యం ముందుకు వచ్చి ఆమోదం తెలిపినట్లు ఈఓపీఆర్డీ మాణిక్యం శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తమ్మినపట్నంలోని పవర్ ప్రాజెక్టు యాజమాన్యం సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు.సోలార్ వీధి దీపాల ఏర్పాటుతో ఆయా పంచాయతీలకు విద్యుత్ బిల్లుల చార్జీలు కూడా తగ్గుతాయని చెప్పారు.

కండలేరులో 11.198 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 11.198 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

నాయుడుపేటటౌన్: పినాకినీ ఎక్స్‌ప్రెస్ నుంచి జారి పడి మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడి ఆచూకీ తెలిసినట్లు సూళ్లూరుపేట రైల్వే జీఆర్పీ ఎస్ఐ శివ సౌమ్య శుక్రవారం తెలిపారు. మృతుడు చీరాల సమీపంలో వేటపాలెం గ్రామానికి చెందిన పృధ్వీ యలమంద(79)గా రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడు నాయుడుపేట పట్టణంలోని నివాసం ఉంటున్న కుమారుడు పృధ్వీ రోశయ్యను చూసేందుకు రైలులో వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు రోశయ్య మేనకూరు సెజ్ పరిధిలో పరిశ్రమలో పనిచేస్తు పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వీధిలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం పత్రికల్లో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన వార్తను చూసిన రోశయ్య తన తండ్రి మృతదేహాన్ని గుర్తించాడు. దీంతో రైల్వే పోలీసులు వృద్ధుడి మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అర్హులందరికీ సంక్షేమం



మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే సుపరిపాలనకు నిదర్శనమని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేక పోయామంటూ కొందరు టీడీపీ సర్పంచ్‌లు ప్రశ్నించడంతో వారికి సూటిగా సమాధానం ఇచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో పంచాయతీకి రూ.కోట్లు వెచ్చించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసి వెళ్లినప్పటికీ, కోవిడ్ కష్టాల్లో కూడా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీదేనని చెప్పారు. మునుపెన్నడూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టించి, దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ రవిరెడ్డి, ఎంపీడీఓ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా కార్గో సేవలు



కార్గో సేవలపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

కోట: ఏపీఎస్ ఆర్టీసీ ప్రజలకు మరింత చేరువగా కార్గో సేవలను అందించడానికి డోర్‌డెలివరీ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని వాకాడు డిపో మేనేజర్ మధుశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ సిబ్బంది కోట బజారువీధిలో కార్గో సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన పార్శిల్, కొరియర్లను డోర్ డెలివరీ చేయనున్నట్లు చెప్పారు. తక్కువ చార్జీతో సురక్షితంగా సకాలంలో మీ పార్శిల్ ఇంటి వద్దకు చేర్చుతున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ కార్గోని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ కృష్ణమ్మ, చంద్రయ్య, జార్జ్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



కుంభాభిషేక పూజలు చేస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: పట్టణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. శనివారం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లపాటు గరుడాళ్వార్ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

ఘనంగా స్కంధషష్టి వేడుకలు

నాయుడుపేట పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీవల్లి, దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణేశ్వరస్వామి స్కంధషష్టి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శత నామ పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు. రాత్రి స్వామివారి నగరోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్ కష్ణ శర్మ, ఆలయ అధ్యక్షులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఊరేగింపు

ముమ్మరంగా ఫాగింగ్

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో దోమల నివారణకు ముమ్మరంగా ఫాగింగ్ చేస్తున్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది శుక్రవారం రాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు.



ఫాగింగ్ చేయిస్తున్న సిబ్బంది

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



వెంకటగిరి రూరల్: నాగుల పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

నాగులచవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో వేడుకలను జరుపుకున్నారు. మహిళలు గ్రామాలకు సమీపంలో ఉన్న నాగులపుట్ట వద్దకు చేరుకుని, పూజలు చేసి, ఉపవాసదీక్షలు విరమించి, మొక్కులు తీర్చుకున్నారు. -సాక్షి నెట్‌వర్క్



చిల్లకూరులో..



దొరవారిసత్రం: ఏకొల్లులో..



చిట్టమూరులో..



కోట: చిట్టేడులో..



నాయుడుపేటలో..



ఓజిలిలో..



పూజలు చేస్తున్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి



సైదాపురం: పూజలు చేస్తున్న మహిళలు



గూడూరులో..